క్లుప్తంగా

అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన గ్రీష్మ

వాల్మీకిపురం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన గ్రీష్మ జిల్లా స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కల్పన తెలిపారు. 29న జరిగిన ఏపీఆర్ గ్యారంపల్లి పాఠశాల నందు జరిగిన జిల్లా స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని, రాష్ట్ర స్థాయికి ఎంపికై ఒదన్నారు. విద్యార్థిని గ్రీష్మ త్వరలో కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల ఉపాధ్యాయులు ధనలక్ష్మి, ప్రియాంక, విద్యార్థులు అభినందించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

– హౌసింగ్ డీఈ శ్రీహరిరావు

తంబళ్లపల్లె: మండలంలో జగనన్న కాలనీలు, గ్రామాలలో ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్లనిర్మాణ పనులు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శ్రీహరిరావు కోరారు. సోమవారం ఏఈ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్లు మంజూరై పనులు ప్రారంభించిన వారితో త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. నవంబర్ నెలాఖరులోగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం కదిరి రోడ్డులో వెలసిన మహబూబే సుబహాని దర్గా ఉరుసు ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం ఖవ్వాలీ పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యంలో స్థానికులు పాల్గొని తరించారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు

ములకలచెరువు: స్థానిక పీహెచ్‌సీని సోమవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ల్యాబ్, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో సౌకర్యాలపం మాట్లాడారు. నిత్యం ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

మార్కెట్ కమిటీ పాలక వర్గం గడువు పెంపు

బి.కొత్తకోట: బి.కొత్తకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా డీఆర్.ఉమాపతి పాలక వర్గానికి ప్రభుత్వం మరో ఆరునెలల గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి గౌరవ చైర్మన్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా డి.రెడ్డెమ్మ, డైరెక్టర్లుగా జి.రామచంద్ర, వై.నాగప్ప, ఎం.రెడ్డెమ్మ, డి.సౌధామిని, ఎస్.అయూబ్‌బాషా, ఎం.ప్రభాకర్‌రెడ్డి, డీపీ.కనకమ్మ, ఎస్.ఈశ్వరమ్మ, ఆర్.అనూషా, వి.వెంకటలక్ష్మమ్మ, కే.కృష్ణారెడ్డి, సి.మస్తాన్‌వలీ, పి.హరీష్‌రెడ్డి, కురబలకోట విండో చైర్మన్, మరో ముగ్గురు అధికారులు సభ్యులుగా నియమితులయ్యారు.

అంకాలమ్మ ఆలయంలో చోరీ


హుండీ పగుల గొట్టిన దృశ్యం

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. ఆదివారం సాయంత్రం పూజారి యదావిధిగా ఆలయ గేట్లుకు తాళాలు వేసుకుని వెళ్లారు. అయితే సోమవారం ఉదయం ఆలయం తెరవడానికి వచ్చి చూడగా అప్పటికే గేట్లు తెరచి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు ఆదివారం రాత్రి సమయంలో గేటు తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. హుండీ పగుల గొట్టి నగదు దోచుకెళ్లారు. అలాగే అమ్మవారి మెడలోని మంగళసూత్రాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆలయం ఈవో రవీంద్రరాజు జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మోహన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలి ముద్ర నిపుణులు సంఘటనా స్థలంలో వేలి ముద్రలు సేకరించారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం తదితరులు

మదనపల్లె : ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం నిమ్మనపల్లె మండలం ముష్టూరు గ్రామపంచాయతీ కస్తూర్బా బాలికల పాఠశాల, మదనపల్లె మున్సిపాలిటీ 12,17వార్డుల పరిధిలో సీఎస్ఐ బాలికల ఉన్నతపాఠశాల, దేవళంవీధి ఉర్దూపాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. శిబిరానికి హాజరైన ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. డాక్టర్లు బాగా చూశారా.? బీపీ, షుగర్ పరీక్షలు చేశారా ? మందులు ఉచితంగా ఇచ్చారా ? గతంలో మరే ప్రభుత్వంలోనైనా ఇలాంటి కార్యక్రమం చేశారాని అడిగారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతోందన్నారు. పేదవాడికి ఉచితంగా వైద్యాన్ని అందించాలని మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే, ఆయన వారసుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3,350కి పైగా వైద్యసేవలను పెంచి, ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో చికిత్సలు ఉచితంగా అందేలా చేశారన్నారు. నియోజకవర్గంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ, వైద్యం కోసం లక్షలు ఖర్చుచేసుకున్న ఎంతోమందికి సీఎం సహాయనిధి ద్వారా దాదాపు 30 కోట్లుకు పైగా పంపిణీ చేశామన్నారు. అలాగే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన అన్ని సేవలను అందించేందుకు పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం, అధునాతన పరికరాలు సమకూర్చామన్నారు. పేదప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు ప్రభుత్వాసుపత్రిలోనే అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి శ్రమిస్తుంటే, ప్రతిపక్షాలు ఉనికిని చాటుకునేందుకు నానాపాట్లు పడుతున్నాయన్నారు. ఎల్లోమీడియా సహాయంతో ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు మంచి చేసిన నాయకుడెవరో అందరికీ తెలుసని, ఆ నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే మన పిల్లల, రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. నిమ్మనపల్లె మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన ఆయన రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెలో రూ.5 లక్షల వ్యయంతో 110 మీటర్ల సీసీరోడ్డు నిర్మాణపనులను సర్పంచ్ రెడ్డెమ్మ, నరేంద్రరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, కమిషనర్ కే.ప్రమీల, ఏఈ బండపల్లిశిరీషా, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, పాల్‌చంద్రశేఖర్, సుగుణ, ఈశ్వర్‌నాయక్, రామిశెట్టిశివయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, షరీఫ్, రాయల్‌రవీంద్ర, పసుపురవి, జేసీఎస్ బావాజీ, నిమ్మనపల్లె ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ సదాశివరెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ చంద్రాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 4,321 మందికి వైద్య సేవలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యా శిబిరాల్లో 4,321 మందికి వైద్య సేవలందించినట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి అన్నారు. కాట్నగల్లులో సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. శిబిరాల్లో రోగులకు రక్త పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేమన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో 54 మంది రోగులను వివిధ ఆసుపత్రులకు రెఫర్ చేశామన్నారు. వీరిలో జిల్లా ఆసుపత్రికి 45 మంది, తిరుపతి స్విమ్స్‌కు 4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 2, ఏరియా ఆసుపత్రికి ఒకరు, వైఎస్సార్ కడప జనరల్ ఆసుపత్రికి ఇద్దరిని రెఫర్ చేసినట్లు డాక్టర్లు పురుషోత్తం నాయక్, శంకర్, అభిలాష్ పేర్కొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా

పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. మండలంలోని కాట్నగల్లులో సోమవారం చివరి రోజు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలో ఈ శిబిరాలను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్లు, మండల స్థాయి అధికారులు, పాలకులకు వారి సేవలను గుర్తించి ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు గణపతిరెడ్డి, అనసూయమ్మ, కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి సన్మానించారు.


కలికిరి: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు హాజరైన ప్రజలు


పెద్దతిప్పసముద్రం: కాట్నగల్లులో వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

302 మందికి వైద్య సేవలు

కలికిరి: మండలంలోని చీకటపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ టి.సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. క్యాంపులో మొత్తం 302 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 5 మందిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, కార్యదర్శి తిమ్మారెడ్డి, వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, హిమబిందు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో సోమవారం శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. అనంతరం వల్లిదేవ సేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురళీమోహన్, సారధి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : ఆడపిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ జాండ్రపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సంక్షేమ పథకాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : రానున్న వేసవిని దృష్టి లోఉంచుకొని ప్రతి గ్రామంలో మంచి నీరు, విద్యుత్ సౌకర్యాలను వెంటనే కల్పించే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగాపురం, కె.దొడ్డిపల్లె పంచాయతీలోని షేర్‌ఖాన్‌వంకవడ్డిపల్లె, గోపాలపురం, గంగాపురం, కురవపల్లె, కత్తివారిపలేల్ గ్రామాలలో ఇంటింటిని సందర్శించి సమస్యలు అడిగితెలుసుకుని పరిష్కరించారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేశారు. షేర్‌ఖానవంక వడ్డిపల్లెలో నీటిసమస్యను తెలియజేయగా వెంటనే నూతన విద్యుత్‌స్టాటర్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సిమెంట్‌రోడ్డు, గంగాపురం దారి సమస్య, నీటి సమస్యపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. ప్రజా సమస్యలు తీర్చలేని అధికారులు అవసరమా, నిధులు ఉన్నా అభివృద్ధి చేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దివ్యాంగ పింఛన్ మంజూరే చేయించాలని కోరినా స్పందించడం లేదని తెలియజేయగా ఆటో ఖర్చులకు నగదు చెల్లించి సదరన్ క్యాంప్‌కు తరలించే బాధ్యత వలంటీర్‌కు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక ఎంపీటీసీ సభ్యులు క్రిష్ణారెడ్డి, సర్పంచ్‌లు జిల్లా రాజగోపాల్‌రెడ్డి, రామచంద్ర, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, మండల ఆర్‌బికె చైర్మన్ హరినాథ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌నాయుడు, గుర్రప్ప, మండల సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. క్రిష్ణానగర్ రెండో క్రాస్‌కు చెందిన శంకరయ్య భార్య వి.రాధ(36) స్థానికంగా ఓ నగల దుకాణంలో పని చేస్తోంది. వీరికి బీఎస్‌సి నర్సింగ్ చదువుతున్న కుమార్తె ఉంది. సోమవారం కుటుంబ సమస్యల కారణంగా నిద్రమాత్రలు మింగి ఇంట్లోనే ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టుటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మంటలు అంటుకొని గాయాలు

మదనపల్లె: వంటింటి పొయ్యి మంటలు అంటుకుని బాలిక గాయపడిన సంఘటన స్థానికంగా జరిగింది. చంద్రాకాలనీకి చెందిన నాగరాజు కుమార్తె ఎ.హిమజ(12) మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతుంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో పొయ్యి వెలిగించి నాన్నమ్మ బయటకు వెళ్లింది. బాలిక కట్టెల పొయ్యి వెలిగిస్తూ ప్రమాదవశాత్తు మంటలు దుస్తులకు అంటుకుని తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

డీఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట


పెళ్లి చేసుకున్న ప్రేమజంట

మదనపల్లె : కులాంతర వివాహం చేసుకున్న ఓ ప్రేమజంట తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని డీఎస్పీ కేశప్పను ఆశ్రయించారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో పెద్దమండ్యం మండలం వెలిగల్లుకు చెందిన సమరసింహారెడ్డి(24), కురబలకోట మండలం గునకుంట్లవారిపల్లెకు చెందిన మాలతి(23)లు డీఎస్పీ కేశప్పను కలిశారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తాము ఆరేళ్ల కిందట కురబలకోట మండలం అంగళ్లులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుకునే సమయంలో ప్రేమించుకున్నట్లు తెలిపారు. ప్రేమ వివాహానికి తమ తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో రెండురోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయి, మదనపల్లె సమీపంలో గుడిలో వివాహం చేసుకున్నామన్నారు. అయితే తమకు ఇరు కుటుంబాల నుంచి ప్రాణభయం ఉండటంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ప్రేమికులు ఇద్దరూ మేజర్లు కావడంతో వారి వినతి మేరకు రక్షణ కల్పిస్తామని డీఎస్పీ కేశప్ప తెలిపారు.

సీస్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రాజగోపాల్

మదనపల్లె సిటీ: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నవంబర్ 3న నిర్వహించనున్న విద్యార్థుల సామర్థ్యాల మదింపు (సీస్) పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారులు ఎం.ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రధానోపాధ్యాయులకు సీస్ పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మదింపు చేయుటకు దేశవ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న తహసీల్దార్ ధనుంజయలు

పీలేరు రూరల్ : దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ కె. ధనుంజయలు అన్నారు. సోమవారం మండలంలోని రేగళ్లు పంచాయతీ యల్లంపల్లెలో మానవ హక్కుల దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లంపల్లె దళితవాడకు స్మశాన స్థలం, తాగునీరు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. తహసీల్దార్ మాట్లాడుతూ దళిత గ్రామాల్లో స్మశాన 2022వ సంవత్సరంలో ప్రభుత్వం దళితవాడల జనాభాను బట్టి అర ఎకరా నుంచి ఎకరా వరకు స్మశాన స్థలం ఇవ్వాలనే ప్రతిపాదన ఉందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఏపీఎం లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్ ఇవ్వకూడదు, ప్రజలు తీసుకోరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వయం సంఘాలకు ప్రభుత్వం విరివిగా రుణాలు ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, డాక్టర్ సతీష్, జేఈ ఎత్తిరాజులు, ఏవో రమాదేవి, సర్పంచ్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరిద్దాం

- నవంబర్ 9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్
- ప్రతిపక్షాల కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి
- వలంటీర్స్, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా


మా నమ్మకం నీవే జగనన్న బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదవారికి చేసిన మంచిని వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లదేనని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో సోమవారం మధ్యాహ్నం మదనపల్లె మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజల కోసం శ్రమిస్తూ, ప్రజలే దైవంగా భావించి మంచి పాలన అందించిన ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్ ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. ప్రతి ఇంటిలోనూ ప్రభుత్వం చేసిన మంచి కనిపిస్తోందన్నారు. దేశచరిత్రలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా లంచాలు లేని పారదర్శక పాలనను గ్రామాల్లోకి తీసుకెళ్లి సుపరిపాలనను అందించారన్నారు. కుల,మత,పార్టీల ప్రసక్తి లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేశామన్నారు. మరో ఆరునెలల్లో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని, అభివృద్ధిని గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మి మోసపోవద్దని, మోసపూరిత హామీలతో అధికారంలోకి రావాలని కలలు కంటున్న టీడీపీ, జనసేన కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, శీలంరమేష్, వైస్ ఎంపీపీ రమణ, సర్పంచ్‌లు బోర్‌వెల్‌మహేష్, శరత్‌రెడ్డి, లక్ష్మీదేవి, వెంకటరమణ, గణేష్, భార్గవిరెడ్డి, బండపల్లి వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ప్రతిభ


జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన మిట్స్ విద్యార్థులు

కురబలకోట: మలితరం టెలికం సేవలు తీసుకురావాలన్న లక్ష్యంతో న్యూఢిల్లీలో జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసి)లో మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు కె.సఫియా, ఎ.కృష్ణ, పి.శివసాయి, ఎస్. యసస్వి, టి.శ్రీజ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ సోమవారం తెలిపారు. అగ్రికల్చర్ విభాగం ప్రదర్శనకుగాను ఈబహుమతి లభించినట్లు తెలిపారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఆసియాలోనే అతిపెద్ద టెలికాం ఫోరం, నెట్ వర్కింగ్ ఈవెంట్ అన్నారు. టెలికమ్యూనికేషన్స్, సెల్యులార్ ఆపరేటర్స్ అసోషియేషన్ సంయుక్తంగా నిర్వహించాయన్నారు. కమ్యూనికేషన్ రంగంలో నూతనంగా కనుగొన్న టెక్నాలజీని మిట్స్ విద్యార్థులు ప్రదర్శించారన్నారు. బౌడరీ ఫైండింగ్ సిక్క అనే యాప్‌ను ఇందులో ప్రదర్శించడంతో ఈ బహుమతి లభించినట్లు తెలిపారు. విప్లవాత్మక ఆవిష్కరణల ద్వారా దేశాన్ని వెలుగులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశంగా న్యూఢిల్లీలో నిర్వహించిన మొబైల్ కాంగ్రెస్‌లో దేశ స్థాయిలో మిట్స్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించడం గొప్ప విషయమని కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయ భాస్కర్‌చౌదరి అభినందించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, విభాగాధిపతి శ్రీదేవి తదితరులు విద్యార్థులను ప్రశంసించారు.

సీఎస్ఆర్ నిధులతో డైనింగ్ హాలు


భోజనశాలను ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ చంద్రశేఖర్


మదనపల్లె సిటీ: స్థానిక ఎంఎల్ఎల్ ఆస్పత్రి వద్ద నున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం కెనరా బ్యాంకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో భోజనశాల నిర్మించారు. సోమవారం పాఠశాలలో భోజనశాలను కెనరా బ్యాంకు హైదరాబాద్ సర్కిల్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, రీజనల్ మేనేజర నాగరాజరావు, స్థానిక బ్యాంకు మేనేజర్ వై.శివకుమార్ ప్రారంభించారు. జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రశేఖర్ మాట్లాడుతూ రూ. 9 లక్షలతో భోజనశాల నిర్మించడం జరిగిందన్నారు. తాను ప్రాథమిక విద్య ఇదే పాఠశాలలో చదవడం జరిగిందన్నారు. ఒక పూర్వ విద్యార్థిగా చదివిన స్కూలులో భోజనశాలను నిర్మించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భువనేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు గోదానం


గోవును దానంగా ఇస్తున్న సుమిత్రమ్మ కుటుంబీకులు

తంబళ్లపల్లె: అనుకున్న కోరిక నెరవేరడంతో మల్లయ్యకొండపైనున్న శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి ఇంట పుట్టిన గోవును దానంగా అందజేశారు. పెద్దతిప్పసముద్రం మండలం పెద్దపల్లెకు చెందిన సుమిత్రమ్మ సోమవారం కుటుంబ సభ్యులతో గోవును తీసుకొచ్చి సోమవారం మల్లయ్యకొండపై వదిలిపెట్టారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కు తీర్చుకున్నారు. ఆమె దానగుణాన్ని ఆలయ కమిటీచైర్మన్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జున, సహదేవలు అభినందించారు. గౌరమ్మ ఆలయంలో పూజారి శేఖర్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బెట్టను అధిగమించిన వేరుశనగ రకం


వేరుశనగ దిగుబడిని లెక్కిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: వేరుశనగలో నూతన టిసిజిఎస్ 1694(విశిష్ట) రకం బెట్ట పరిస్థితులను అధిగమించి ఎకరానికి 18 బస్తాల దిగుబడినిచ్చినట్లు కేవీకే కో-ఆర్డినేటర్ పాండురంగ తెలిపారు. మండలంలోని కొర్లకుంట వద్ద రైతు సాగు చేసిన టిసిజిఎస్ 1694(విశిష్ట) రకం వేరుశనగ సాగు పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో ఒక చెట్టుకు 20 నుండి 25 కాయలున్నట్లు గుర్తించారు. 100 నుంచి 105 రోజుల్లో పంటకాలంగా గల ఈ రకం అధిక దిగుబడులుస్తోందని తెలిపారు. ఈ పంట విత్తనాల కోసం నిలుపుకోవడానికి చేపట్టాల్సిన జాగ్రత్తలను రైతుకు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సోమశేఖర్‌బాబు, మాధురి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీపై ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న డీఎం ఆర్‌సీ నిరంజన్

మదనపల్లె సిటీ: కార్గో డోర్ డెలివరీపై సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేయాలని మదనపల్లె ఆర్టీసీ-2 డీఎం ఆర్‌సీ నిరంజన్ అన్నారు. సోమవారం స్థానిక డిపో కార్యాలయంలో కార్గో డోర్ డెలివరీ ప్రచార మహోత్సవం సందర్భంగా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 90 ముఖ్య పట్టణాల్లో డోర్ డెలివరీ సదుపాయం కలదన్నారు. 1 కేజీ వరకు రూ.18, 1 కేజీ నుంచి 6 కేజీల వరకు రూ.30, 6 కేజీల నుంచి 10 కేజీల వరకు రూ.36, 10 కేజీల నుంచి 25 కేజీల వరకు రూ.48, 25 కేజీల నుంచి 50 కేజీల వరకు రూ.59 వసూలు చేయడం జరుగుతుందన్నారు. ప్రచార మాసోత్సవాల్లో ప్రతి సిబ్బంది నాలుగు డోర్ డెలవరీలు బుక్ చేయాలన్నారు. సమావేశంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.